రోజంతా ఒకటే వాన..

దామెర: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గురువారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో బయటికి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. దామెరలోని గిద్దె చెరువు, ఊరుగొండ పెద్ద చెరువు, కోగిల్వాయి శనిగ చెరువు, పులుకుర్తి రంగనాయకుల చెరువులోకి వరద నీరు భారీగా చేరుతోంది. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలుపడంతో చెరువులు మత్తడి పడే అవకాశం ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముస్త్యాలపల్లి వాగుపై నూతన బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతుండగా రాకపోకలకు తాత్కాలిక రహదారి ఏర్పాటు చేశారు. కానీ గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వాగు నీరు భారీగా పోటెత్తడంతో తాత్కాలిక రహదారి కొట్టుకుపోయింది. దీంతో ముస్త్యాలపల్లి, తక్కళ్లపహాడ్ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

శాయంపేట : గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి చలివాగు ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా చేరి నిండుకుండలా కనిపిస్తోంది. దీంతో చలివాగు ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 20ఫీట్ల వరకు నీటి మట్టం చేరింది. వివిధ గ్రామాల నుంచి వరద నీరు భారీగా చేరడంతో అలుగు పడుతోంది. దీంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చలివాగు అలుగుపడుతుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రాజెక్టు సమీపానికి ఎవరు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు.

పరకాల: భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత సూచించారు. మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి, వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్ రెడ్డి, కౌనిలర్లతో కలిసి లోతట్టు ప్రాంతాలతో పాటు చలివాగు వద్ద పొలాల్లోకి వెళ్తున్న వరదను పరిశీలించారు. పొలాల్లోకి వెళ్తున్న వరదను జేసీబీ సాయంతో చలివాగులోకి మళ్లించారు. మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటుతో పాటు రెస్క్యూ టీం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కౌన్సిలర్ ఒంటేరు సారయ్య, మున్సిపల్ సానిటేషన్ అధికారి వెంకట్‌రెడ్డి మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.


శాయంపేట: రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి అలుగుపోస్తున్న చలివాగు


దామెర: ముస్త్యాలపల్లి వాగు సమీపంలో కొట్టుకు పోయిన తాత్కాలిక రహదారి


పరకాల: వరదను మళ్లిస్తున్న అధికారులు

15వ రోజుకు చేరిన జీపీ సిబ్బంది సమ్మె


ధర్మసాగర్: సమ్మె చేస్తున్న జీపీ సిబ్బంది


కమలాపూర్ : రాస్తారోకో చేస్తున్న కార్మికులు

ధర్మసాగర్: తమ డిమాండ్లను నెరవేర్చాలని గ్రామ పంచాయతీ కార్మికులు, సిబ్బంది చేపట్టిన సమ్మె గురువారం 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జీపీ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు చల్లా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయితీ సిబ్బంది న్యాయమైన డిమాండ్లు, సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. గత 15 రోజుల నుంచి సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందిచకపోవడం హేయమైన చర్యన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించే వరకు సమ్మె విరమించేది లేదని తేల్చి చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వాజిద్, ఇమ్మడి శ్రీనివాస్, గుర్రపు అశోక్, ఆమంచ నరసయ్య, శ్రీకాంత్, చిట్యాల మమత, నమిండ్ల రాజమ్మ, ఇమ్మడి అరుణ, చిలుక రిబ్కా, జాలిగపు సాంబరాజు, మండలంలోని వివిధ గ్రామాల పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రీషన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్: గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్లు వెంటనే నెరవేర్చాలని సీపీఐ మండల కార్యదర్శి నకీర్త ఓదెలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం 15వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కమలాపూర్‌లో జీపీ కార్మికులు వర్షంలోనూ సమ్మె కొనసాగించారు. అనంతరం సీపీఐ నాయకులతో కలిసి హుజూరాబాద్-పరకాల ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 15 రోజులుగా తాము సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్మికులు సమ్మెలో దిగడంతో గ్రామాల్లో పారిశుద్యం లోపించి కంపు కొడుతున్నాయని అన్నారు. ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు ఇసంపెల్లి అయిలయ్య, ఉపాధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

సురేష్ కుటుంబానికి చేయూత



ధర్మసాగర్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఓ చానెల్‌లో రిపోర్టర్‌గా చేస్తున్న బొడ్డు సురేష్ కుటుంబానికి మాదిగ జర్నలిస్టు పరపతి సంఘం చేయూతనిచ్చింది. గురువారం సురేష్ కుటుంబానికి రూ. 35,500 లను ఆ సంఘం నాయకులు ఆర్థిక సాయంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సురేష్ కుటుంబానికి ఇంటి స్థలం, దళిత బంధు పథకం అందేలా స్థానిక ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అనంతరం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బొక్క దయాసాగర్, ఆరూరి రమేష్, అంతడుపుల శ్రీనివాస్, జయరాజ్, సల్మాన్, కటుకూరి రవి కుమార్, నరేందర్, పాడిశెట్టి కరుణాకర్, కొట్టె పద్మయ్య, గజ్జల సుమన్, పొలుమారి గోపాల్, బూర సదానందం, పలువురు జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

గంగు భానుమూర్తికి నివాళి



ఐనవోలు: శ్రీమల్లికార్జునస్వామి ఆలయ ఈఓ కార్యాలయంలో గంగు భానుమూర్తి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి దేవాలయ అర్చక ఉద్యోగులు గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అర్చక, ఉద్యోగ సంఘాల అధ్యక్షులు పాతర్లపాటి నరేశ్ శర్మ, అద్దంకి కిరణ్‌కుమార్‌లు మాట్లాడారు. దేవాదాయ ధర్మాదాయశాఖలో పని చేస్తున్న 3600 మంది అర్చక ఉద్యోగులకు ప్రభుత్వం తరపున ట్రెజరీ జీతాల కొరకు భానుమూర్తి పని చేశారని కొనియాడారు. జిల్లా సంఘం నాయకులు వినయ్, మహేష్, శ్రీనివాస్, శేఖర్, రవీందర్, శ్రీనివాస్, భాను ప్రసాద్, మధుకర్, నారాయణరావు, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అనుకూల ప్రభుత్వం బీఆర్‌ఎస్

- ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్
- రైతులతో ముఖాముఖి

ఎల్కతుర్తి: ప్రజలకు అనుకూలంగా ఉండేది బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాత్రమేనని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని కోతులనడుమ గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన రైతు ముఖాముఖి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు 24గంటల పాటు నాణ్యమైన విద్యుత్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ మాత్రమేనన్నారు. కాంగ్రెస్ హయాంలో సరిగ్గా 4 గంటల కరెంట్ కూడా రాని పరిస్థితి ఉండేదని, కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని అయోమయ స్థితిలో రైతన్నలు కొట్టుమిట్టాడేవారని గుర్తు చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో గౌరవెల్లి ప్రాజెక్టు ద్వారా మెట్టప్రాంతాలకు త్వరలోనే సాగు, తాగునీరు అందించనున్నట్లు వెల్లడించారు. రేవంత్‌రెడ్డి రైతులకు 3గంటల కరెంట్ సరిపోతుందని చెప్పడం సిగ్గుచేటని ఎమ్మెల్యే మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా హుస్నాబాద్ నియోజకవర్గంలో 1లక్షా 6వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు వెల్లడించారు. అనంతరం లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించారు. జెడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్, ఎంపీపీ మేకల స్వప్న, వైస్ ఎంపీపీ తంగెడ నగేశ్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, వైస్ చైర్మన్ మునిగడు శేషగిరి, సర్పంచ్ బోయినపల్లి రజిత-దేవేందర్‌రావు, ఎంపీటీసీ కొమురయ్య మండల అధ్యక్షుడు సమ్మయ్యగౌడ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

దిష్టిబొమ్మ దహనం చేసిన నాయకులు


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

పరకాల: తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న పరిపాలన చూస్తుంటే రజకార్ల గుర్తుస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. గురువారం బాటసింగారంలో డబుల్ ఇంబెడ్రూం ఇళ్లను పరిశీలించటానికి బయలుదేరిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని అనుమతిలేదంటూ అక్రమంగా అరెస్టు చేయటాన్ని నిరసిస్తూ పరకాల బస్టాండ్ కూడలిలో తెలంగాణ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి జయంత్‌లాల్, ఉపాధ్యక్షుడు శ్రీరాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు భద్రయ్య, పూర్ణచారి, మండల అధ్యక్షుడు రవీందర్ పాల్గొన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా



ఆత్మకూరు : అదుపు తప్పి కారు బోల్తా పడింది. ఈ సంఘటన గురువారం సాయంత్రం మండలంలోని గూడెప్పాడ్ శివారులో చోటుచేసుకుంది. హనుమకొండ నుంచి భూపాలపల్లికి వెళ్తున్న ఓ కారు జాతీయ రహదారిపై అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు ఉన్న ఇద్దరు వ్యక్తులకు స్వల్పగాయాలైయ్యాయి. అక్కడే ఉన్న స్థానికులు వారికి సహాయ చర్యలు చేపట్టారు. కాగా రోడ్డు విస్తరణ పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

బీమా గ్రామంగా 'పత్తిపాక' ఎంపిక

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామాన్ని బీమా గ్రామంగా భారతీయ బీమా సంస్థ ఎంపిక చేసింది. ఈ మేరకు ఆ సంస్థ పరకాల చీఫ్ మేనేజర్ విశ్వనాథం గ్రామాభివృద్ధికి రూ. 1లక్ష 25వేల మంజూరు చేసి పత్రాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్‌కు గురువారం అందించారు. ఈ సందర్భంగా చీఫ్ మేనేజర్ మాట్లాడుతూ పత్తిపాక గ్రామ ప్రజలు అత్యధికంగా ఎల్ఐసీ పాలసీలు పొందారని అన్నారు. గ్రామ అభివృద్ధి కోసం ఎల్ఐసీ సంస్థ నుంచి రూ. 1లక్ష 25 వేలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులను కమ్యూనిటీ హాల్, మూత్రశాలలు, సోలార్ లైట్, చేతిపంపు, పాఠశాల విద్యార్థులకు ఫర్నిచర్ కొనుగోలుకు ఉపయోగిస్తామని పంచాయతీ కార్యదర్శి వెల్లడించారు. అలాగే పెద్దకోడెపాక, కొప్పుల గ్రామాలను కూడా ఎంపిక చేపినట్లు తెలిపారు. డివిజన్‌లోని 14 గ్రామాలను బీమా గ్రామాలుగా ఎంపిక చేసి రూ. 30 లక్షల నిధుల ప్రొసీడింగ్‌లను అందించనున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రతీ ఒక్కరు ఎల్ఐసీ పాలసీ తీసుకొని కుటుంబానికి రక్షణ కల్పించాలని చీఫ్ మేనేజర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ ఏబీఎస్ అరుణ్‌మిత్ర, ఎల్ఐసీ ఏజెంట్ కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వేళాయె..



శాయంపేట : మండలంలో గత రెండు రోజులుగా వర్షాలు జోరుగా కురుస్తుండడంతో చెరువులు అలుగు పోస్తున్నాయి. దీంతో మత్స్యకారులు చేపల వేటకు వెళ్తున్నారు. జోగంపల్లి శివారులో గల చలివాగుతో పాటు వివిధ గ్రామాల్లో చెరువులు మత్తడి పోస్తుండడంతో వలలు వేసి చేపలు పట్టారు. చలివాగు వద్ద వల విసిరి చేపలు పడుతున్న దృశ్యం సాక్షి కంటపడింది.

క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఆర్డీఓ



పరకాల: పరకాల ఆర్డీఓగా కె. శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన రామునాయక్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో భూపాలపల్లి నుంచి శ్రీనివాస్ బదిలీపై వచ్చారు. తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి, ఏఓ సంధ్యారాణితో పాటు ఆర్డీఓ కార్యాయల ఉద్యోగులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

ఎస్సైకి సన్మానం



ఐనవోలు: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై వంగాల నవీన్‌కుమార్‌ను మండలంలోని పలువురు నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండల పరిస్థితులపై చర్చించి ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. యువత, విద్యార్థుల నడవడికపై ప్రత్యేక దృష్టి సారించాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఎస్సైని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. దర్గా సొసైటీ వైస్ చైర్మన్ మాదాసు బాబు, జిల్లా ఆత్మ కమిటీ డైరెక్టర్ కట్కూరి రాజు, నాయకులు మండల సమ్మిరెడ్డి, వడియాల భూపాల్‌రెడ్డి, పిట్టల సుధీర్, బర్ల శ్రావణ్ తదితరులు ఉన్నారు.

పల్టీ కొట్టిన ట్రాలీ..



ఆత్మకూరు: మండల కేంద్రం సమీపంలో గురువారం కూరగాయల వాహనం బోల్తాపడింది. ఏటూరునాగారానికి చెందిన కూరగాయల వ్యాపారి మోహన్ వరంగల్ నుంచి కూరగాయలు కొనుగోలు చేసి ట్రాలీలో తీసుకెళ్తుండగా మండల కేంద్రం సమీపంలో అదుపుతప్పి బోల్తాపడింది. ట్రాలీ ఉన్న కూరగాయాలు రోడ్డు పాలయ్యాయి. ఈ సంఘటనలో వ్యాపారి మోహన్‌తో పాటు డ్రైవర్‌కు స్వల్ప గాయలయ్యాయి.

అండగా ఉంటాం..



దామెర: బాధిత కుటుంబానికి అండగా ఉంటామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెసరు విజయ్‌చందర్ రెడ్డి అన్నారు. మండలంలోని పులుకుర్తి గ్రామానికి చెందిన ఈదునూరి రమేష్ ఇటీవల ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబాన్ని ఆయన గురువారం పరామర్శించారు. రమేష్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి కొంత ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు, ప్రధాన కార్యదర్శులు గన్ను సతీష్, వేల్పుల రాజ్‌కుమార్, బీజేవైఎం జిల్లా కోశాధికారి సూర చందర్, పెంచాల జగన్, దుబాసి నాగరాజు, పెరుక వేణు, పెంచాల రమణయ్య, రాజ్, శ్యామ్, నరేష్, వినోద్ తదితరులు ఉన్నారు.

విరాళం అందజేత



కమలాపూర్: మండలంలోని శ్రీరాములపల్లిలో నూతనంగా చేపట్టిన పద్మశాలి కుల సంఘ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కొనుగోలు చేసేందుకు మండలంలోని ఉప్పల్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు స్వర్గం రవి విరాళం అందించారు. ఈ మేరకు రవి పంపించిన రూ.2 లక్షలను స్థానిక నేతలు శ్రీరాములపల్లి పద్మశాలీలకు గురువారం అందించారు. స్థలం కొనుగోలుకు తన వంతు సాయం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తడక రాణి, జెడ్పీటీసీ లాండిగె కల్యాణి, ఉప్పల్ సర్పంచ్ దేవేందర్‌రావు, కో ఆప్షన్ సభ్యుడు ఖాజా మసనోద్దీన్, మాజీ జెడ్పీటీసీ మారెపెల్లి నవీన్‌కుమార్, నాయకులు మాడిశెట్టి శ్రీనివాస్, జక్కుల సదయ్య, రాజమౌళి, పద్మశాలి కుల పెద్దలు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

ఐనవోలు: రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించేందుకు వెళ్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని భారీ వర్షంలో అరెస్టు చేయడం సరికాదని బీజేపీ జిల్లా కార్యదర్శి గుండెకారి కోటేశ్వర్‌రావు గురువారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నియంతల్లా వ్యవహరిస్తుందని ఆరోపించారు. బీజేపీ నాయకులను అక్రమంగా అరెస్టులు చేస్తూ, కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

రైతు వ్యతిరేక పార్టీలను తరిమికొట్టాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

పరకాల: రైతు వ్యతిరేఖ పార్టీలను తరిమికొట్టాలని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. 24గంటల ఉచిత విద్యుత్ అవసరం లేదంటూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మండలంలోని కామారెడ్డిపల్లి, నాగారం, పరకాల రైతు వేదిక వద్ద రైతులు, పార్టీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నాడు తెలంగాణ ఉద్యమంపై తుపాకీ ఎక్కిపెట్టిన రేవంత్‌రెడ్డి నేడు తెలంగాణను చూసి విషం చిమ్ముతున్నాడని విమర్శించారు. రైతును రాజు చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో ఎక్కడలేని విధంగా రైతు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. రైతు సంక్షేమం పట్టించుకోని కాంగ్రెస్ నాయకులు తాము అధికారంలోకి వస్తే కేసీఆర్ పాలనలో రైతులకు అందుతున్న సంక్షేమ అభివృద్ధి ఫలాలను అందకుండా చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సారంగపాణి, రైతు సమన్వయ సమితి వరంగల్ జిల్లా కన్వీనర్ బొల్లె భిక్షపతి, వైస్ ఎంపీపీ చింతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, కామారెడ్డిపల్లి సర్పంచ్ రాజమౌళి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


చెక్కులు అందజేస్తున్న జెడ్పీవైస్ చైర్మన్

ఐనవోలు: రైతు సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని జెడ్పీవైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో 2021-22 సంవత్సరానికి సంబంధించిన 95 మంది మొక్కజొన్న రైతులకు పంటనష్టం కింద రూ.3,28,320 చెక్కులు మంజూరు కాగా గురువారం లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా రైతులకు గొప్ప పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. యాసంగి మొక్కజొన్న పంటనష్ట బధితులకు కూడా త్వరలో ఎకరానికి రూ. 10 వేలు అందించనున్నట్లు తెలిపారు. చెక్కులు మంజూరై మూడు నెలలు కావస్తున్న అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని పలువురు రైతులు వాపోయారు. ఈ నెల 25వ తేది వరకు చెక్కు వ్యాలిడిటీ ఉందని, ముందుగా చెక్కులు ఇస్తే మార్పిడికి తగినంత సమయం ఉండేదని రైతులు తెలిపారు. మండలంలో 17 గ్రామాలు ఉండగా సింగారం, కొండపర్తి, వనమాల కనపర్తి, వెంకటాపూర్, ఐనవోలు 5 గ్రామాల రైతులకే నష్ట పరిహారం చెక్కులు మంజూరు చేయడంపై మిగతా రైతులు అసహనం వ్యక్తం చేశారు. నష్టపరిహారం జరిగిన సమయంలో వ్యవసాయశాఖ అధికారులు సరిగా సర్వే చేయలేదని దాంతో చాలా మంది రైతులు నష్టపోయారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జునస్వామి ఆలయ కమిటీ చైర్మన్ మజ్జిగ జైపాల్, గ్రామ రైతుబంధు కో ఆర్డినేటర్‌లు భైరి వెంకటయ్య, చెవ్వ రాజారాం, జిల్లా ఆత్మకమిటీ డైరెక్టర్ కట్కూరి రాజు, ఏఈఓలు అరుణ్, హీన, అనూష, రైతులు పాల్గొన్నారు.

రైతుబంధు సమితి కో ఆర్డినేటర్‌గా సంపత్

మండల రైతుబంధు మండల సమితి కో ఆర్డినేటర్‌గా మునిగాల సంపత్‌ను అధికారికంగా నియమించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారిచేసినట్లు ఏఓ అడప కవిత తెలిపారు. గతంలో విధులు నిర్వహించిన మజ్జిగ జయపాల్ ఆలయ చైర్మన్‌గా నామినేట్ కావడంతో రైతుబంధు మండల కో ఆర్డినేటర్ ఖాళీ అయింది. మండల బీఆర్‌ఎస్ నాయకులు పోలెపల్లి శంకర్‌రెడ్డి, బుర్ర రాజశేఖర్, రవీందర్‌లతో పాటు రైతులు, గ్రామస్తులు శుభాకాంక్షలు తెలియజేశారు.

వర్గీకరణ జరిగే వరకూ పోరాటం


మాట్లాడుతున్న ఎమ్మెస్పీ నాయకుడు

ధర్మసాగర్: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే వరకు పోరాటం ఆపేది లేదని ఎమ్మెస్పీ జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి, కో ఆర్డినేటర్ శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్‌లు అన్నారు. ఆగస్టు నెలలో నిర్వహించతపెట్టిన ఛలో హైదరాబాద్ మాదిగల విశ్వరూప మహా సభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పోరాటం అంతిమ దశకు చేరుకుని, పార్లమెంట్‌లో బిల్లుకు చట్టబద్దత సాధించుకునే దగ్గరలో ఉందన్నారు. ప్రతీ మాదిగ బిడ్డ పార్టీలకు అతీతంగా ఏకం కావాలని కోరారు. అధికారంలోకి రాగానే ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బీజేపి 9 ఏండ్లు గడుస్తున్నా వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకుండా మాదిగలను మోసం చేస్తుందన్నారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లుకు చట్టబద్దత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొట్టె కల్యాణ్, మాట్ల వెంకటస్వామి, చిలుక రాజు, జనగాని చిరంజీవి, పొలిమారి పవన్, మాచర్ల పవన్, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలి


మాట్లాడుతున్న సంజీవరెడ్డి

ఆత్మకూరు: ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం బీఆర్‌ఎస్ యూత్, విద్యార్థి విభాగం, సోషల్ మీడియా ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టారని అన్నారు. ప్రజలు ధర్మారెడ్డి వెంటే ఉన్నారని, ప్రజాధరణ చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని ఆరోపించారు. చల్లా ధర్మారెడ్డి నియోజకవర్గంలో మరో సారి ఎమ్మెల్యేగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మార్క సుమలత, జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాంతాల కేశవరెడ్డి, విద్యార్థి విభాగం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి అర్షం మధుకర్, జాగృతి జిల్లా ప్రతినిధి రావుల సతీష్, మండల యూత్ అధ్యక్షుడు వంశీగౌడ్, సోషల్ మీడియా అధ్యక్షుడు శ్రీధర్, ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు పాపని రవీందర్, నాయకులు వంగాల భగవాన్‌రెడ్డి, అంకూస్, భిక్షపతి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాల్సన్‌రాజ్‌తోనే ప్రపంచ స్థాయి గుర్తింపు


పాల్సన్‌రాజ్‌ను అభినందిస్తున్న ప్రముఖులు

ధర్మసాగర్: మండలంలోని కరుణాపురం క్రీస్తు జ్యోతి ప్రార్థన మందిరం ప్రపంచ స్థాయిలో లిఖించబడేందుకు క్రీస్తుజ్యోతి మినిస్ట్రీస్ ఫౌండర్ ప్రవక్త రెవరెండ్ డాక్టర్ సంగాల పాల్సన్‌రాజ్ ప్రార్థన ఫలితమేనని పలువురు ప్రముఖులు కొనియాడారు. కరుణాపురంలోని సొసైటీ ఆఫ్ క్రైస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో పలువురు క్రైస్తవ ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు. ఆసియా ఖండంలోనే 40 వేల మంది ఏక కాలంలో కూర్చొని ప్రార్థనలు చేసుకునే సుందరమైన దేవాలయం క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిర నిర్మాణమని, అది పాల్సన్‌రాజ్ శ్రమ కృషి ఫలితమేనన్నారు. ఈ సందర్భంగా యూఎస్ 12 గ్లోబల్ కమ్యూనిటీ అస్కార్స్, దానికె డెవిస్ అవార్డు, కాంగ్రెస్ మెన్‌రిప్రజెంటీవ్ జోన్‌లైన్‌జాక్సన్ బహుమానం, ఫ్యామిలీ క్రిస్టియన్ సెంటర్ దా స్పిరిచువల్ ఫాదర్ ఆఫ్ ఇండియా, మోడల్ యూఎస్ హౌజ్ ఆఫ్ రిప్రజెంటీవ్ ఇచ్చిన అవార్డును ఈ సందర్భంగా వారు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జోసెఫ్ ప్రభాకర్, డాక్టర్ కె ఎం జాన్, డాక్టర్ చిరంజీవి, డాక్టర్ కురియన్, జోజిరెడ్డి, జయపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, మార్టిన్ లూథర్, దివాకర్, ఐజాక్, దానం, సామ్యేల్, ఎలియా, ఇమ్మానియేల్, థామస్, రవిపాల్, యోహన్నపాల్, క్రైస్తవులు, పాస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.